

# ఆ 11 మంది జ్ఞాపకార్థం

## చిన్నస్వామి స్టేడియంలో ఎప్పటికీ ఖాళీగా 11 సీట్లు!

గతేడాది ఐపీఎల్ టైటిల్ గెలిచిన సంబరాల్లో జరిగిన ఘోర విషాదం తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తిరిగి తమ సొంతగడ్డపై బరిలోకి దిగనుంది. ఈ నేపథ్యంలో ఆ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అభిమానులకు గౌరవంగా నివాళులర్పించేందుకు ఆర్సీబీ ఫ్రాంచైజీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్సీఏ)తో కలిసి కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌కు ముందు, స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద మృతుల జ్ఞాపకార్థం ఒక స్మారక ఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతేకాకుండా స్టేడియంలోని 11 సీట్లను శాశ్వతంగా వారి పేరు మీద రిజర్వ్ చేసి, ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచుతారు. భవిష్యత్తులో ఇక్కడ జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా అన్ని ఈవెంట్లలో ఈ సీట్లు ఖాళీగానే ఉంటాయని అధికారులు తెలిపారు. గతేడాది జూన్ 4న ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల భారీ తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సుమారు 3 లక్షల మంది అభిమానులు ఒక్కసారిగా గుమిగూడటంతో జరిగిన ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 50 మందికి పైగా గాయపడ్డారు. సరైన అనుమతులు తీసుకోకుండా వేడుకలు నిర్వహించి, అలజడికి కారణమయ్యారని కర్ణాటక ప్రభుత్వం అప్పట్లో ఆర్సీబీ, కేఎస్సీఏలను బాధ్యుల్ని చేసింది. అనంతరం మృతుల కుటుంబాలకు ఆర్సీబీ ఫ్రాంచైజీ ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించింది. ఈ విషాదం తర్వాత చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇప్పుడు ప్రభుత్వ అనుమతితో ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లను ఇక్కడ ఆడనుంది. మిగిలిన రెండు హోమ్ మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లో నిర్వహించనున్నట్లు ఫ్రాంచైజీ ఇదివరకే వెల్లడించింది.



# ఉప్పల్ స్టేడియానికి కొత్త కళ

## రూ.10 కోట్లతో అభివృద్ధి చేసిన సన్ గ్రూప్

హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సరికొత్త హంగులను సంతరించుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్య సంస్థ అయిన సన్ గ్రూప్, స్టేడియం ఆధునికీకరణ పనులను భారీ ఎత్తున చేపట్టింది. ఈ పనుల కోసం రూ.10 కోట్లకు పైగా వ్యయం చేసినట్టు సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తెలిపింది. ఈ ఆధునికీకరణలో భాగంగా స్టేడియంలోని ప్రేక్షకులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. స్టేడియం వ్యాప్తంగా ఉన్న 46 టాయిలెట్లను, ఒక లాంజ్‌తో సహా 42 బాక్సులను పూర్తిగా పునరుద్ధరించారు. దీంతో పాటు, కొత్తగా రెండు ఎలివేటర్లను (లిఫ్టులు), 43 ఎయిర్ కండిషనర్లను (ఏసీలు) ఏర్పాటు చేశారు. ఈ మార్పులతో స్టేడియం సదుపాయాలు కొత్తరూపు సంతరించుకున్నాయి. స్టేడియంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనుల వివరాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. రాబోయే క్రికెట్ మ్యాచ్‌లకు హాజరయ్యే అభిమానులకు ఈ కొత్త సౌకర్యాలు మెరుగైన అనుభూతిని అందించనున్నాయి.

# మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ 2026

## రూల్స్ కట్టుదిట్టం చేసిన బీసీసీఐ!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌ను మరింత కట్టుదిట్టమైన నిబంధనల మధ్య నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సిద్ధమైంది. టోర్నమెంట్ సమయంలో జట్ల ప్రవర్తన, లాజిస్టిక్స్, క్రమశిక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. మార్చి 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) మధ్య జరగనున్న ఆరంభ మ్యాచ్‌కు ముందే ఈ కొత్త నియమావళిని ఫ్రాంచైజీలకు పంపారు. మంగళవారం నాడు ఫ్రాంచైజీలకు పంపిన ఈ కొత్త రూల్స్‌లో కీలక మార్పులు చేశారు. ముఖ్యంగా, మ్యాచ్ జరిగే రోజు జట్లు ఎలాంటి ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించకూడదని బీసీసీఐ స్పష్టం చేసింది. కేటాయించిన నెట్స్‌లో, నిర్దిష్ట సమయంలో మాత్రమే ప్రాక్టీస్ చేయాలి. ఫిట్‌నెస్ డ్రిల్స్ లేదా టెస్టులపై కూడా నిషేధం విధించారు. ప్రాక్టీస్ ఏరియాల్లోకి ఆటగాళ్లు, అనుమతి ఉన్న సిబ్బందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఆటగాళ్ల కుటుంబ సభ్యులు హాస్పిటాలిటీ జోన్లకే పరిమితం కావాలి. ఆటగాళ్ల



కదలికలపైనా బీసీసీఐ ఆంక్షలు విధించింది. ప్రాక్టీస్‌కు వెళ్లేందుకు ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ బస్సులోనే ప్రయాణించాలి. వారి వెంట కుటుంబ సభ్యులకు అనుమతి లేదు. నెట్ బౌలర్లు, త్రోడౌన్ స్పెషలిస్టుల వివరాలను కూడా ఫ్రాంచైజీలు ముందుగానే బోర్డుకు సమర్పించి అనుమతి తీసుకోవాలి. మ్యాచ్ రోజుల్లో సహాయక సిబ్బంది అందరూ తమ అక్రిడిటేషన్ కార్డులను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే హెచ్చరికలతో పాటు జరిమానాలు కూడా విధిస్తారు. ఇక బ్రాడ్‌కాస్ట్, ప్రజెంటేషన్ ప్రమాణాలపైనా కొత్త రూల్స్ తీసుకొచ్చారు. ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ హోల్డర్లు మ్యాచ్ రోజుల్లో తప్పనిసరిగా ఆ క్యాప్‌లను ధరించాలి. పోస్ట్-మ్యాచ్ ప్రజెంటేషన్ సమయంలో ఆటగాళ్లు స్లీవ్‌లెస్ జెర్సీలు, ఫ్లాపీ టోపీలు ధరించరాదని, కఠినమైన డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. ప్రాక్టీస్ సమయంలో ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డులను బంతితో కొట్టడం, వాటి ముందు కూర్చోవడం కూడా నిషిద్ధం.

# యుద్ధనౌకల నీడలో చెస్ ఆడలేను

## క్యాండిడేట్స్ టోర్నీ నుంచి కోనేరు హంపి సంచలన నిష్క్రమణ



పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత చెస్ స్టార్ కోనేరు హంపి అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన క్యాండిడేట్స్ చెస్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె ప్రకటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. యుద్ధ ప్రాంతానికి చేరువలో ఉన్న సైప్రస్ ద్వీప దేశంలో, యుద్ధనౌకల పహారా మధ్య ప్రశాంతంగా కూర్చుని ఎత్తులు వేయడం సాధ్యం కాదని ఆమె చెప్పారు. ఒక మహిళగా, విదేశీయురాలిగా అంతటి ఉద్రిక్త పరిస్థితుల మధ్య ప్రయాణించి ఏకాగ్రతతో ఆడటం అసాధ్యమని హంపి అభిప్రాయపడ్డారు. ఈ టోర్నీ కోసం తన కుమార్తెకు దూరంగా ఉండి మూడు నెలల పాటు కఠినంగా శ్రమించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు ఆటను ఆస్వాదించేలా లేవని హంపి ఆవేదన వ్యక్తం చేశారు. సైప్రస్‌కు వెళ్లవద్దంటూ అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఇప్పటికే 'లెవెల్-3' హెచ్చరికలు జారీ చేశాయని ఆమె గుర్తు చేశారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ వేదికలపై ఉన్న ద్వంద్వ ప్రమాణాలను కూడా ఆమె ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌లో కూడా లెవెల్-3 హెచ్చరికలే ఉన్నాయని, మరి అక్కడ ఇలాంటి టోర్నీలు నిర్వహించడంలో తప్పేముందని ఆమె నిలదీశారు. కేవలం విలాసవంతమైన రిసార్టులు ఉంటే సరిపోదని, చెస్ వంటి మేధోపరమైన క్రీడకు ఆహ్లాదకరమైన వాతావరణం కూడా అవసరమని హంపి స్పష్టం చేశారు. సైప్రస్ వంటి ప్రాంతాలు భారత్‌లో ఎన్నో ఉన్నాయని, ఇక్కడే టోర్నీని నిర్వహించవచ్చు కదా? అని ఆమె సూచించారు. ఇదే టోర్నీలో పాల్గొంటున్న ఇతర భారత క్రీడాకారులు ప్రజ్ఞానంద, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్‌ల నిర్ణయాల గురించి మాట్లాడేందుకు హంపి నిరాకరించారు. ఎవరి వ్యక్తిగత ఆసక్తులు, ఆందోళనలు వారికి ఉంటాయని, తన నిర్ణయం మాత్రం తనకు సరైనదేనని ఆమె స్పష్టం చేశారు. కాగా, హంపి తప్పుకోవడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ క్రీడాకారిణి, మాజీ ఛాంపియన్ అనా ముజిచుక్‌ను ఫిడె ఎంపిక చేసింది.

# తండ్రిని కోల్పోయినా దేశం కోసం ఆడాడు

## టీ20 హీరో రింకూ సింగ్‌కు ప్రభుత్వ ఉద్యోగం



టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన యువ బ్యాటర్ రింకూ సింగ్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే పథకంలో భాగంగా రింకూ సింగ్‌కు ఈ గౌరవం దక్కింది. అంతర్జాతీయ వేదికపై దేశానికి గర్వకారణంగా నిలిచిన పలువురు ఇతర అథ్లెట్లకు కూడా యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఉద్యోగాలను ప్రకటించింది. ఇండియా టుడే కథనం ప్రకారం, టీ20 ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకోవడంలో రింకూ సింగ్ అందించిన సేవలకు గుర్తింపుగా అతడిని రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ (ఆర్ఎస్ఓ)గా నియమించాలని యూపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో ఓడించి భారత్ మూడోసారి విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే, ఈ టోర్నమెంట్ రింకూకు వ్యక్తిగతంగా ఎంతో విషాదాన్ని మిగిల్చింది. టోర్నీ మధ్యలోనే తండ్రి క్యాన్సర్‌తో మరణించినా, ఆ బాధను దిగమింగుకుని తిరిగి జట్టుతో చేరి దేశం కోసం ఆడటం అతని అంకితభావానికి నిదర్శనం. రింకూతో పాటు మరికొందరు క్రీడాకారులకు కూడా ఉన్నత స్థాయి ఉద్యోగాలు కల్పించారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత హాకీ జట్టు సభ్యుడు, ఘాజీపూర్‌కు చెందిన రాజ్‌కుమార్ పాల్‌ను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియమించారు. అలాగే, పారాలింపిక్స్‌లో సత్తా చాటిన గౌతమ్ బుద్ధ నగర్‌కు చెందిన హైజంప్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్‌కు కూడా డీఎస్పీ హోదా కల్పించారు. ఇటావాకు చెందిన పారాలింపిక్ జావెలిన్ త్రో రజత పతక విజేత అజిత్ సింగ్, ఘజియాబాద్‌కు చెందిన పారాలింపిక్ 200 మీటర్ల కాంస్య పతక విజేత సిమ్రన్‌లకు జిల్లా పంచాయతీ రాజ్ ఆఫీసర్ పోస్టులను కేటాయించారు. ఈ నియామకాలతో పాటు 2024-25 సంవత్సరానికి గాను 9 మంది క్రీడాకారులను లక్ష్మణ్ అవార్డు, రాణి లక్ష్మీబాయి అవార్డులతో సత్కరించనున్నారు. ఈ అవార్డుల కింద ఒక్కొక్కరికి రూ. 3.11 లక్షల నగదు బహుమతితో పాటు కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. లక్నోలోని లోక్ భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ క్రీడాకారులకు నియామక పత్రాలను, అవార్డులను అందజేసి అభినందించనున్నారు.

# రాజస్థాన్ రాయల్స్ కొత్త యాజమాన్యంలో హేమాహేమీలు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో ఒక చరిత్రాత్మక ఒప్పందం ఖరారైంది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో 1.63 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.13,500 కోట్లు) అమ్ముడుపోయింది. అమెరికాకు చెందిన టెక్ పారిశ్రామికవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని ఓ కన్సార్టియం, ఈ జట్టులో 100 శాతం వాటాను దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఒక జట్టు బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ధరకు అమ్ముడుపోవడం ఇదే తొలిసారి కాగా, ఇది లీగ్‌లోనే అతిపెద్ద యాజమాన్య బదిలీ ఒప్పందంగా నిలిచింది. అయితే, ఈ భారీ డీల్‌కు సారథ్యం వహిస్తున్న కల్ సోమానీ ఎవరు? ఆయన నేపథ్యం ఏమిటి? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అమెరికాలోని స్కాట్స్‌డేల్ కేంద్రంగా పనిచేసే కల్ సోమానీ, టెక్నాలజీ రంగంలో సుప్రసిద్ధులు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎడ్-టెక్, డేటా ప్రైవసీ వంటి రంగాల్లో ఆయనకు 15 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. 'ఇంట్రాఎడ్జ్', 'ట్రూయో' వంటి విజయవంతమైన టెక్నాలజీ కంపెనీలను ఆయన స్థాపించారు. ముఖ్యంగా ఏఐ గవర్నెన్స్, డేటా భద్రత విషయంలో టెక్ వర్గాల్లో సోమానీని ఒక నిపుణుడిగా పరిగణిస్తారు. టెక్నాలజీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన ఆయన, క్రీడా రంగంలోకి అడుగుపెట్టడం ఇదే మొదటిసారి కాదు. ఇప్పటికే అమెరికాలోని మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌లో సహ-యజమానిగా ఉన్న సోమానీ, ప్రముఖ గోల్ఫ్ క్రీడాకారులు టైగర్ వుడ్స్, రోరీ మెక్‌ఇల్రాయ్ ప్రారంభించిన 'టీజీఎల్' గోల్ఫ్ లీగ్, 'టీఎంఆర్ డబ్ల్యూ' స్పోర్ట్స్‌లో కూడా పెట్టుబడులు పెట్టారు. రాజస్థాన్ రాయల్స్‌తో సోమానీ బంధం కొత్తదేమీ కాదు. 2021లోనే ఆయన ఈ ఫ్రాంచైజీలో పెట్టుబడిదారుడిగా చేరారు. అప్పుడే ఐపీఎల్ భవిష్యత్ వృద్ధిపై ఆయన బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆయన నాయకత్వం వహిస్తున్న కన్సార్టియం వెనుక ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన వ్యాపార కుటుంబాలు ఉండటం విశేషం. వీరిలో వాల్‌మార్ట్ సంస్థల వారసుడు, డెన్వర్ బ్రాంకోస్ ఫుట్‌బాల్ జట్టు యజమాని రాబ్ వాల్టన్ ఒకరు. 110 బిలియన్ డాలర్లకు పైగా సంపదతో అమెరికాలోనే అత్యంత సంపన్న క్రీడా యజమానిగా ఆయనకు పేరుంది. అలాగే, ఫోర్డ్ మోటార్ కంపెనీ వారసులైన హాంప్ కుటుంబం కూడా ఈ కన్సార్టియంలో భాగస్వామిగా ఉంది. టెక్నాలజీ, క్రీడా రంగాల్లో తనకున్న విస్తృతమైన నెట్‌వర్క్‌తో రాజస్థాన్ రాయల్స్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మరింత బలోపేతం చేయాలని సోమానీ లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, 2008లో జరిగిన తొలి ఐపీఎల్ వేలంలో కేవలం 67 మిలియన్ డాలర్లకే అమ్ముడైన రాజస్థాన్ రాయల్స్, నేడు 1.63 బిలియన్ డాలర్ల విలువ పలకడం ఐపీఎల్ బ్రాండ్ విలువకు నిదర్శనంగా నిలుస్తోంది. కొత్త యాజమాన్య మార్పులు 2026 ఐపీఎల్ సీజన్ తర్వాత అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.



# అన్ని రంగాల్లో నగరాభివృద్ధే లక్ష్యం: మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, మార్చి 24: కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించిన మేయర్, అభివృద్ధి పనులను ప్రారంభించి, సమస్యలను పరిశీలించారు. 44వ డివిజన్ సప్తగిరి కాలనీలోని కస్తూరిభా గాంధీ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డితో కలిసి రూ.38 లక్షల నాబార్డ్ నిధులతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తదనంతరం 49వ డివిజన్ సంతోష్‌నగర్‌లో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్‌తో కలిసి సంతోషిమాత దేవాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భాగ్యనగర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.4 లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని, శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 66 డివిజన్లలో సమస్యలను దశలవారీగా పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.



స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సప్తగిరి పాఠశాలలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, కర్రె పద్మ అనిల్, గాజ రమ శివరాం, డీఈ శ్రీనివాస్, ఏఈలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వాగులపై వంతెనలు నిర్మించి రైతులను ఆదుకోవాలి

## హుస్నాబాద్ మండలం కూచనపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామ పరిధిలో ఉన్న వాగులపై వెంటనే వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం నిరసన చేపట్టారు. కూచనపల్లి నుంచి మాలపల్లికి వెళ్లే దారిలోని వాగుతో పాటు, హుస్నాబాద్ వెళ్లే మార్గంలోని అంకుష్‌గండి వాగుపై వంతెనలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా నాయకులు ఎత్తిచూపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ..కూచనపల్లి నుంచి మాలపల్లి గ్రామానికి వెళ్లే వాగులో బ్రిడ్జి లేకపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కింద ఉన్న అంకుష్‌గండి వాగుపై వంతెన లేకపోవడం వల్ల ఆ ప్రాంతంలోని భూములకు వెళ్లడం రైతులకు గగనంగా మారిందని పేర్కొన్నారు. వానాకాలంలో చిన్నపాటి వర్షం కురిసినా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, దీనివల్ల కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వారు ఆరోపించారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పటికైనా గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రత్యేక చొరవ చూపి వెంటనే వంతెనల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, యాస శ్రీనివాస్ మరియు రైతులు గికూరు తిరుపతి, నరసయ్య, బంక రాజు, బండి చంద్రం, గుళ్ళ సారయ్య, సతీష్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను వేరు చేద్దాం.. స్వచ్ఛ హుస్నాబాద్‌ను నిర్మిద్దాం

## మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పిలుపు

## 7వ వార్డులో చెత్త విభజనపై అవగాహన సదస్సు

హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతలో భాగస్వాములై హుస్నాబాద్‌ను ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో 7వ వార్డులోని గణేష్ నగర్‌లో చెత్త విభజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లోనూ చెత్తను తడి, పొడి, హానికరమైన వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లోనూ, డ్రైనేజీ కాలువల్లోనూ చెత్తను వేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి మొక్కలకు వాడుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపాలని వివరించారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, శుభకార్యాలకు మెప్మా ఆధ్వర్యంలో ఉన్న స్టీల్ బ్యాంకులను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో తయారైన సేంద్రియ ఎరువును వార్డు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఇన్చార్జి ఆర్.ఐ ప్రసాద్, పర్యావరణాధికారి రవికుమార్, వార్డ్ ఆర్.పి జగదీశ్వరి, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, జవాన్ సారయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ దళాల్లో క్రీడలకు ప్రాధాన్యం పెంపొందాలి: బండి సంజయ్




న్యూఢిల్లీ, మార్చి 24: లాన్ టెన్నిస్ వంటి క్రీడలు ఏకాగ్రత, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యం, సమతుల్యత, రణతంత్ర ఆలోచనలను పెంపొందిస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇవే లక్షణాలు ఒక ఉత్తమ పోలీస్ అధికారికి అవసరమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఆర్.కె. ఖన్నా స్టేడియంలో నిర్వహిస్తున్న 26వ ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్--2026ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఐటిబిపి డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్, టెన్నిస్ క్రీడాకారిణి రియా భాటియా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పోలీస్, పారా మిలటరీ దళాలు అంతర్గత భద్రత నుండి సరిహద్దుల రక్షణ వరకు అనేక బాధ్యతలు నిర్వర్తిస్తుంటాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, టీమ్ స్పిరిట్‌ను బలోపేతం చేస్తాయని చెప్పారు. లాన్ టెన్నిస్ క్రీడ ద్వారా సోదర భావం, సహకారం, ఆరోగ్యకరమైన పోటీ భావన పెరుగుతాయని, క్రీడాకారులు పరస్పరం అనుభవాలు పంచుకుని కొత్త ఉత్సాహంతో విధుల్లోకి తిరిగి చేరతారని పేర్కొన్నారు. దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఖేలో ఇండియా', 'ఫిట్ ఇండియా' వంటి కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. పోలీస్, అర్ధ సైనిక దళాల్లో కూడా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా జాతీయ ఐక్యత, పరస్పర గౌరవం, సహకార భావనను పెంపొందించే వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ సెంటర్ ల ఆకస్మిక తనిఖీ

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

## జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి




కోరుట్ల, జనతా న్యూస్ : కోరుట్ల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్లను జగిత్యాల డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని అతిక్రమించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ఆసుపత్రులు, క్లినిక్స్ వంటి వైద్య సంస్థలు ప్రభుత్వ నియమాల ప్రకారం నమోదు అయి,ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించాలి అనే చట్టం ను, పి.సి.పి.ఎన్.డి.టి యాక్ట్, గర్భంలో ఉన్న శిశువు లింగాన్ని తెలుసుకోవడం లేదా చెప్పడం నిషేధించి, ఆడ శిశువుల హత్యను నివారించడానికి రూపొందించిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అనుమతుల కోసం రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన డాక్టర్ల ద్వారా నే వైద్య సేవలు అందించాలని,కొత్తగా ఎవరైనా వచ్చినట్లయితే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల లో మళ్ళీ జతచేయాలని అలా చేశాకే వారి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. 1994 గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ ఆయన పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోలలోఅప్పజెప్పాలని ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరం అలా చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోంబోర్డులు ఏర్పాటు చేయవలెనని ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దు పరుచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం,సూపర్వైసర్లు నాగభూషణం,ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం



**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎన్సీసీ శిబిరం నిర్వహణ




కరీంనగర్, మార్చి 24: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్సీసీ శిబిరంలో విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి శిబిరాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న కేడెట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి భావనతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవాటు కావాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో నైతిక విలువలు, విధేయత, ఏకాగ్రత ఎంతో అవసరమని, తోటి వారితో స్నేహపూర్వకంగా ఉండాలని, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయాలని విద్యార్థులకు సూచించారు. బాధ్యతలను ఎటువంటి సందేహం లేకుండా సమర్థంగా నిర్వర్తించేలా శిక్షణ పొందాలని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఎన్సీసీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, మార్గదర్శకాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులకు శిక్షణతో పాటు భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. శిబిరంలో అందించిన సదుపాయాలపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేయగా, ఎన్సీసీ అధికారులు కూడా నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల నుండి వచ్చిన ఎన్సీసీ కేడెట్లు, అధికారులు, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

